క్లుప్తంగా

సజావుగా కానిస్టేబుల్ రాత పరీక్ష



ప్రిజమ్ కళాశాలలో పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

సీతంపేట: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా సాగింది. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకాస్యప్, ప్రిజమ్ కళాశాల, వీటీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. ప్రిజమ్ కళాశాలలో 696 మందికి 622 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా.. వీటీ హైస్కూల్‌లో 463 మందికి 442 మంది, శ్రీకాస్యప్ కళాశాలలో 480 మందికి 427 మంది హాజరయ్యారు. ద్వారకా పోలీసుల బందోబస్తు మధ్య పరీక్ష సజావుగా జరిగింది.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ హెచ్‌ఎంగా రాధాకుమారి



గౌరవ వందనం స్వీకరిస్తున్న హెచ్‌ఎం రాధాకుమారి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా జయంతి రాధాకుమారి ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ హెచ్‌ఎంగా పని చేస్తున్న లక్ష్మీనరస మధురానగర్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాధాకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లచే హెచ్‌ఎం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, సభ్యులు అమరాన వెంకటరమణ పాల్గొన్నారు.

మంచిగా నడుచుకోండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: తగాదాలు, గొడవల జోలికి పోకుండా రౌడీషీటర్లు మంచిగా నడుచుకోవాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ చంద్రశేఖర్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి నేరాల జోలికి వెళ్లినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందన్నారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ.. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్ టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ చిన్నం నాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకూడదని, మంచిగా నడుచుకుని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని రౌడీషీటర్లను ఎస్ఐ హెచ్చరించారు.

పేదలకు బియ్యం పంపిణీ

అల్లిపురం: పేదలకు 3 కేజీల బియ్యం చొప్పున 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అందజేశారు. ప్రతి నెల చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం పేదల ఇళ్లకు వెళ్లి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 25 మంది పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు రాము తెలిపారు.

నత్తనడకన కల్వర్టు పనులు



దొండపర్తి జంక్షన్ వద్ద ప్రధాన రహదారిని మూసివేసి చేపడుతున్న కల్వర్టు పనులు



రోడ్డు మూసివేతతో వన్‌వేలో ఇరువైపులా ప్రయాణిస్తున్న వాహనాలు

- దొండపర్తి జంక్షన్ వద్ద ప్రధాన రహదారి మూసివేత
- వన్‌వేలో రాకపోకలతో ప్రయాణికుల అవస్థలు

తాటిచెట్లపాలెం: దొండపర్తి జంక్షన్ వద్ద జీవీఎంసీ అధికారులు చేపడుతున్న కల్వర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం సుమారు నెల రోజుల నుంచి ఇక్కడి ప్రధాన రహదారిని మూసివేశారు. నాటి నుంచి నెమ్మదిగా పనులు జరుగుతున్నాయి. ఒకరోజు పనులు నిర్వహిస్తే.. రెండు రోజులు ఆగిపోతున్నాయి. వీటికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల ఈ రహదారి ఇరుగ్గా, ప్రమాదరకంగా మారింది. అసలే నిత్యం రద్దీగా ఉండే ప్రధాన జంక్షన్ కావడం, నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు ప్రయాణించే మార్గం కావడంతో మరింత రద్దీగా మారింది. దీంతో వన్‌వేలో రాకపోకలు సాగించలేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

నిత్యం ట్రాఫిక్ జామ్

అల్లిపురం వైపు వెళ్లే మార్గం మూసివేసి ఈ పనులు జరిపిస్తున్నారు. ఈ కారణంగా అక్కయ్యపాలెం నుంచి అల్లిపురం వైపు వెళ్లే వాహనాలు ఇటు డైమండ్ పార్క్ మీదుగా లేదా శ్రీకన్య రోడ్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో శ్రీకన్య థియేటర్ రోడ్డులో ట్రాఫిక్ పెరిగిపోయింది. ఈ రోడ్డులో సైతం ఒక వైపు దారిని మూసేశారు. ఒక రోడ్డులోనే ఇరువైపులా వాహనాలు వెళ్తున్నాయి. దీంతో ప్రతి రోజూ ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. జీవీఎంసీ అధికారులు స్పందించి వేగవంతంగా కల్వర్టు పనులను పూర్తి చేసి ఈ మార్గంలో రాకపోకలను కొనసాగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం



శంకరమఠంలో నిర్వహిస్తున్న వల్లీ దేవసేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

సీతంపేట: శ్రీ శరవణ భవ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠంలో వల్లీ దేవసేవ సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభించి మండపారాధన, కల్యాణమూర్తులకు స్నపన తిరుమంజనం, అనంతరం కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ శరవణ భవ సంస్థాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ కల్యాణం ద్వారా అపమృతు దోషాలను పోగొట్టి జీవితంలో యువతకు మంచి నడవడికను, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వేడుకుంటున్నట్టు తెలిపారు. ధర్మ సంస్థాపన కేవలం సుబ్రహ్మణ్య ఆరాధన వల్ల పునరావృతం అవుతుందన్నారు. ఇప్పటి వరకు సంస్థ ద్వారా 85 కల్యాణ మహోత్సవాలు నిర్వహించామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, కార్యదర్శి అచ్యుతరామయ్య, డాక్టర్ విద్యాసుధ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం



వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తదితరులు

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా.. ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయకుండా మొండిచేయి చూపిందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆదేశాల మేరకు ఈ నెల 4న వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ ప్రచార పోస్టర్లు ఆదివారం 46వ వార్డు కైలాసపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి, మాయ చేసి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వార్డులోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నిరసనతో ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరిపిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, బి.గోవిందరాజు, కె.చిన్నా, దూది నరసింహారావు, సోమనాయుడు, కోట రామారావు, ఎస్.ఈశ్వరరావు, కె.శ్రీను, ఎస్వీ రమణ, బొట్ట రాజు, జి.అప్పారావు, దుర్గాభవాని, కె.ఈశ్వరరావు, అప్పలరెడ్డి, నారాయణరెడ్డి, విజయలక్ష్మి, దేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: జర్నలిస్టుల పిల్లల్లో అత్యంత ప్రతిభావంతులు ఉన్నారని, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తన శక్తి మేర ఏటా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఒక ప్రైవేట్ కార్యాలయంలో ఆదివారం 20 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు ఒక కేటగిరి, అంతకుపైన విద్యార్హత ఉన్న వారికి మరో కేటగిరి కింద స్కాలర్‌షిప్‌లు అందించినట్లు ఆయన చెప్పారు. అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులను కండువాతో సత్కరించి ప్రశంసా పత్రం, నగదు ప్రోత్సాహకం అందజేశారు. నిరంతరం సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులకు విద్య, వైద్య సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

అలరించిన డ్యాన్స్ పోటీలు





సమ్మర్ క్యాంప్ వేడుకల్లో తమ డ్యాన్స్‌తో అదరగొడుతున్న చిన్నారులు

సీతంపేట: స్నేహాంజలి డ్యాన్స్ స్కూల్ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా ఆదివారం ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. సుమారు నెల రోజుల పాటు స్కూల్‌లో నేర్చుకున్న డ్యాన్స్‌ను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. కూచిపూడి, భరత నాట్యం, వెస్టన్, ఫోక్ డ్యాన్స్‌ల్లో శిక్షణ పొందిన చిన్నారులు పాటలు, మ్యూజిక్‌కు తగ్గట్టు స్టెప్పులేసి అదరగొట్టారు. అనంతరం ప్రతిభ చూపిన చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

రైల్వే ఆస్పత్రిలో పారిశుధ్య పనుల విభాగం



రైల్వే ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ పనులను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోరా, జ్యోత్స్న బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో అధునాతన, పరిశుభ్రమైన మెకానికల్ క్లీనింగ్ సిస్టంను వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా వైద్యాధికారులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత కోసం మొదటిసారిగా ఈ పనులను ప్రైవేటు సంస్థ (సింగూరి నాగేశ్వర్రావు ఏజెన్సీకి మూడేళ్ల కాలవ్యవధితో కాంట్రాక్టు అప్పగించారు. సుశిక్షితులైన 39 మంది సిబ్బంది అధునాతర మెకానికల్ సిస్టంతో నిరంతరం ఆస్పత్రిని వీరు పరిశుభ్రంగా ఉంచుతారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ. శాంతారాం, చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్) డి. శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ప్రవీణ్ భటి, రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు, ఏసీఎంఎస్ డాక్టర్ చారుమతి, సీనియర్ డివిజినల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు దీక్షలో భెల్ నాయకులు



రిలే నిరాహార దీక్షలో భెల్ ఇంటక్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆదివారం భెల్ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఇంటక్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం..కూటమి నాయకులు మేము మాత్రమే విశాఖ ఉక్కును కాపాడగలమని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. తర్వాత ఉక్కు పరిశ్రమను వేగవంతంగా ప్రైవేటీకరణ దిశగా పావులు కదుపుతున్నారన్నారు. దీనిలో భాగంగా విశాఖ ఉక్కులో శాశ్వత ఉద్యోగులను సుమారు 1500 మందిని వీఆర్ఎస్ పేరుమీద తొలగించడం, కాంట్రాక్ట్ కార్మికులను 3000 మందిని తొలగించడం, శాశ్వత ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సుమారు 6 నెలల నుంచి సగం జీతాలు చెల్లించడం దురదృష్టకరం అన్నారు. విశాఖ ఉక్కు అభివృద్ధి చెందడం అంటే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం అని అర్థం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు భద్రత కరువైందన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ప్రధాని మోదీతో మాట్లాడి ఒప్పించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పరిశ్రమకు సొంత గనులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో భెల్ ఇంటక్ యూనియన్ నాయకులు వారాడ ఆనందరావు, సీతన్‌నాయుడు, సీహెచ్.మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి సర్వర్ దెబ్బ

- సాంకేతిక సమస్యతో సాగని పంపిణీ
- తొలిరోజు ఉదయం 5 నుంచి 10 మందికి మాత్రమే పంపిణీ
- మెషీన్లు పని చేయక వెనుదిరిగిన లబ్ధిదారులు
- కార్డుల మ్యాపింగ్ ఒక చోట, రేషన్ డిపో మరో చోట
- ఎండలో నిరీక్షించలేక కార్డుదారుల మండిపాటు



గణేష్‌నగర్‌లో సర్వర్ పని చేయక నిరీక్షిస్తున్న కార్డుదారులు



మురళీనగర్ : సరకుల కోసం వేచి ఉన్న మహిళలు



వేలి ముద్రలు పడక అవస్థ పడుతున్న వృద్ధురాలు

సీతంపేట: కూటమి ప్రభుత్వం అట్టహాసంగా డిపోల వద్ద రేషన్ పంపిణీని ప్రారంభించిన తొలిరోజే సర్వర్ మొరాయింపు, వెర్షన్ 9.0 సాఫ్ట్‌వేర్‌లో టెక్నికల్ సమస్యతో ఇబ్బందులు తలెత్తాయి. లబ్ధిదారుల వేలి ముద్రలు మెషిన్ తీసుకోక గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. గంటకు ఇద్దరు ముగ్గురికి కూడా పంపిణీ చేయలేక డీలర్లు అవస్థల పాలయ్యారు. మెషీన్లు పని చేయక కార్డు దారులు వెనుదిరిగారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు ప్రజల వద్దకే చేరవేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాలను రద్దు చేసి మరల పాత పద్ధతిలో డీలర్ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభించింది. ఈ మేరకు ఈ-పాస్ మెషీన్లలో ఇప్పటి వరకు డీలర్ లాగిన్, ఎండీయూ లాగిన్ ఉండగా శనివారం రాత్రి ఎండీయూ లాగిన్ తొలగించి కేవలం డీలర్ లాగిన్ మాత్రమే ఉంచారు. దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన 9.0 వెర్షన్ సరిగా పని చేయక డీలర్లు ఇబ్బందులు పడ్డారు. ఉత్తర నియోజకవర్గంలో ప్రతి వార్డులో ఆదివారం ఉదయం 7 గంటలకే రేషన్ పంపిణీని ప్రారంభించారు. సర్వర్ స్లోగా ఉండటం, 9.0 వెర్షన్ సరిగా పని చేయక ప్రతి డిపోలో కేవలం 5 నుంచి 10 మందికి మాత్రమే రేషన్ సరుకుల పంపిణీ జరిగింది. వేలి ముద్రలు తీసుకోక, సర్వర్ నెమ్మదించడంతో రేషన్ అప్రూవల్ రాక గంటల తరబడి లబ్ధిదారులు నిరీక్షించారు. ఎంతసేపు ఉండాలంటూ విసుగు చెంది కొంతమంది వెనుదిరిగారు. గత నెల వరకు ఇంటికి రేషన్ బండి వచ్చేది. మరల డీలర్ వద్ద లైన్లు కట్టాలా అంటూ మహిళలు మండిపడుతున్నారు.

బోసి పోయిన డిపోలు...

కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన రేషన్ పంపిణీ డిపోల వద్ద జనం లేక బోసి పోయింది. ఏ డిపో వద్ద చూసినా నలుగురైదుగురు మాత్రమే లబ్ధిదారులు కనిపించారు. వారికి కూడా సర్వర్ కారణంగా సరుకుల పంపిణీ బాగా ఆలస్యం కావడంతో మరల వస్తామంటూ వెనుదిరిగారు. జీవీఎంసీ 25వ వార్డు గణేష్‌నగర్‌లో గల 12వ నంబరు రేషన్ డిపో ఉదయం 8 గంటలకే తెరిచినప్పటికీ ఒక్కరు కూడా రాకపోవడంతో ఖాళీగా కన్పించింది. 12వ నంబరు డిపోకు వార్డు పరిధిలోని కార్డులు కాకుండా సీతమ్మధార, రేసపువానిపాలెం ప్రాంతాలకు చెందిన కార్డులు మ్యాపింగ్ చేయడంతో గతంలో ఎండీయూ వెహికిల్‌పై ఆయా ప్రాంతాల వెళ్లి రేషన్ సరుకులు అందజేసేవారు. ఇపుడు మరల రేషన్ డిపోల వద్ద సరుకుల పంపిణీ ప్రారంభించడంతో సీతమ్మధార, రేసపువానిపాలెం వారికి డిపోదూరం కావడంతో లబ్ధిదారులు వారికి సమీప డిపోలను ఆశ్రయించడంతో 12వ నంబరు డిపో ఖాళీగా దర్శనమిచ్చింది.

అక్కడి డిపో.. ఇక్కడ

జీవీఎంసీ 42వ వార్డుకు చెందిన రేషన్ డిపో నంబరు-1కి సంగం ఆఫీస్, సుబ్బలక్ష్మీనగర్, దొండపర్తి, ఇందిరా ప్రియదర్శిని ఓల్డేజ్ హోమ్, చెక్కుడు రాయి బిల్డింగ్ వెనుక, ఎస్‌కేఎంల్ వెనుక ప్రాంతానికి చెందిన సుమారు 950 రేషన్ కార్డులు మ్యాపింగ్ చేశారు. అయితే అక్కడి ప్రజలకు, లబ్ధిదారులకు అందుబాటులో ఉండాల్సిన డిపోను 26వ వార్డు లలితానగర్‌లో తొండం వినాయకుని గుడి ఎదురు లైన్‌లో ఉన్న తన సొంత ఇంటి సెల్లార్‌లో ఏర్పాటు చేశారు డీలర్. దీంతో డిపో దూరాభారంగా ఉందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. అంత దూరం నుంచి సరుకుల కోసం రాలేమని, తమ ప్రాంతంలో డిపో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 26వ వార్డులో ఇప్పటికే ఐదు రేషన్ షాపులు ఉన్నాయని, వేరే వార్డు, వేరే ప్రాంతానికి చెందిన డిపో ఇక్కడ పెట్టడం వల్ల తమ కార్డు దారులు అతని వద్దకు వెళ్లిపోతారని, తమకు నష్టం కలుగుతుందని డీలర్లు అంటున్నారు.

ఎండలో అవస్థలు..

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు బర్మా కాలనీ, ఎన్జీజీవోస్ కాలనీలోని 51, 55, 65, 525 నంబరు డిపోల్లో సరకుల పంపిణీలో నాయకులు పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు డిపోలు తెరిచినప్పటికీ లబ్ధిదారులు రాలేదు. మొదటి రోజు తక్కువ సంఖ్యలో డిపోలకు వచ్చారు. సరైన సమాచారం లేకపోవడం వల్ల లబ్ధిదారులు మొదటి రోజు రేషన్ సరకులు తీసుకోలేకపోయారు. కొన్ని డిపోల వద్ద మహిళలు ఎండల్లో నిలబడి రేషన్ సరకుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. విపరీతమైన ఎండకు వీరు ఇబ్బంది పడ్డారు. డిపో నంబరు 51లో 850, డిపో 55లో 1100, డిపో 63లో 1150, డిపో నంబరు 527లో 850 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరిలో మొదటి రోజు 8 శాతం మందికి మాత్రమే సరకులు ఇచ్చారు.

నక్కవానిపాలెంలో రేషన్ డిపో ప్రారంభం



24వ వార్డులో రేషన్ డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో రేషన్ డిపోను నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేసి రేషన్ డిపోల వద్దే సరుకుల పంపిణీని ఈ నెల నుండి ప్రారంభించింది. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గెడ్డలు, డ్రైనేజీల్లో పూడికతీత



చైతన్యనగర్ డ్రైనేజీలో పూడిక తీస్తున్న జీవీఎంసీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: మద్దిలపాలెం చైతన్యనగర్ కనకమ్మ టెంపుల్ రోడ్డులో పూడికలతో నిండిన గెడ్డలు, డ్రైనేజీలను ఆదివారం జీవీఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. ఈ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో డ్రైనేజీలు సరిగా ప్రవహించడం లేదు. సమస్యను తెలుసుకున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది గెడ్డల్లో పూడికలను తొలగించి, డస్ట్ బిన్లు ఖాళీ చేసి, చుట్టూ బ్లీచింగ్ వేశారు.

శ్రావ్యంగా గాత్ర కచేరీ



గాత్ర కచేరి చేస్తున్న రమ్య, కిరణ్మయి బృందం

మద్దిలపాలెం: పర.. సంగీత బృందం 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి గాయత్రి విద్యా పరిషత్ ఆచార్యుడు పి.సోమరాజు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రమ్య, కిరణ్మయి బృందం గాత్ర కచేరి శ్రావ్యనందకరంగా సాగింది.